సాక్షి
కాకినాడ
ఆదివారం | 19 | నవంబర్ | 2023



కట్టుకున్న వారి కళ్లెదుటే..

కట్టుకున్న వారి కళ్లెదుటే ఇద్దరు వివాహితులు దుర్మరణం పాలైన విషాద సంఘటనలు పశ్చిమ గోదావరి, కాకినాడ జిల్లాల్లో చోటు చేసుకున్నాయి.

10లో



రూ.10 లక్షల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన భవన నిర్మాణానికి వెలగల చంద్రశేఖరరెడ్డి, రాధాదేవి దంపతులు (రావులపాలెం) శనివారం రూ.10 లక్షల విరాళం సమర్పించారు.

డెల్టాలకు 7 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 7 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగుల వద్ద కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్రపై అవగాహన

– కలెక్టర్ కృతికా శుక్లా



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలో వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర విజయవంతానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా కోరారు. ఈ యాత్ర నిర్వహణపై కలెక్టరేట్‌లో శనివారం ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆమె చర్చించారు. యానాం ప్రాంతీయ పరిపాలన అధికారి మునిస్వామి, యానాం ఎస్పీ ఆర్.రఘునాయక్‌లు దీనికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ రమణారెడ్డి వీక్షిత్ యాత్రకు జిల్లాలో చేపట్టాల్సిన కార్యకలాపాలను వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర పథకాల ద్వారా ప్రయోజనం పొందని లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ యాత్ర పేరిట ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఐసీఈ వ్యాన్ ద్వారా వివిధ గ్రామీణ ప్రాంతాల్లో సాంస్కృతిక, సమాచార కార్యకలాపాల ప్రదర్శనకు ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న విజయ్ ప్రకాష్

పెద్దాపురం: భోపాల్‌లో జరగనున్న జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ శనివారం తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఆంధ్ర, తెలంగాణ రీజియన్ క్లస్టర్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. అండర్–19 విభాగంలో సీహెచ్ సాయిశ్రుతి (టీం కెప్టెన్), దర్శిక, సాయి సుచిత్ర, దరణి. అండర్–19 బాలుర విభాగంలో త్రిషాల్ రాజ్‌కుమార్ (టీం కెప్టెన్), సూర్య విఖ్యాత్, తనూజ్ వెంకట సాయి విష్ణు, అండర్–19 సింగిల్స్ విభాగంలో సీహెచ్ సాయి శృతి, త్రిషాల్ రాజ్‌కుమార్ ఎంపికైనట్టు వివరించారు. ఎంపికైన విద్యార్థులను విజయ్ ప్రకాష్, జాయింట్ సెక్రటరీ సమీరా, సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, కోలేటి వేణుగోపాల్, శ్రీరామ్ అభినందించారు.

వారబందీ పద్ధతిలో రబీకి సాగునీరు : కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలో గోదావరి కాలువ ఎగువ ప్రాంతాల్లో లిఫ్ట్‌ల సహాయంతో రబీ సాగు చేసే రైతులకు వారబందీ విధానంలోనే సాగునీరు సరఫరా చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వ్యవసాయం, ఇరిగేషన్, రెవెన్యూ, ఏపీఈపీడీసీఎల్, లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులు, వివిధ నీటి సంఘాల ప్రతినిధులతో ఈ విషయమై సమీక్షించారు. జిల్లాలో గోదావరి కాలువ ఎగువన సామర్లకోట మండలం కాపవరం, పెద్ద బ్రహ్మదేవం, వేట్లపాలెం, జి.మేడపాడు గ్రామాల వద్ద పదు ప్రాంతాల్లో లిఫ్టుల సాయంతో రైతులు సాగుచేస్తున్నారని, ఈ సీజన్లో ఆయకట్టు చివరి భూముల రైతులకు కూడా సాగునీరు అందించాలన్నారు. లిఫ్ట్‌లకు ఎనిమిది గంటలు మాత్రమే విద్యుత్ ఇవ్వాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం 120 రోజుల పంట కాల వరి వంగడాలను ఎంచుకుని, డిసెంబర్ 5 లోపు నారుమడులు వేసుకునేలా రైతులకు వివరించాలన్నారు. మార్చి 30 తర్వాత సాగు నీరు రాదని వారికి చెప్పాలన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ ఏడీ పద్మశ్రీ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఫైనల్.. ఫీవర్

All the best Team INDIA

- జిల్లావ్యాప్తంగా క్రికెట్ ప్రపంచ కప్ సందడి
- నేటి ఫైనల్‌పైనే సర్వత్రా ఉత్కంఠ
- పనులన్నీ పక్కన పెట్టి మరీ నిరీక్షణ
- పలు చోట్ల అభిమానుల కోసం భారీ స్క్రీన్ల ఏర్పాటు



భారత్ విజయాన్నికాంక్షిస్తూ రాజమహేంద్రవరం చిత్రకారుడు హరి తాడోజు గీసిన చిత్రమిది

నాగమల్లితోట(కాకినాడ సిటీ): క్రికెట్.. సాధారణ క్రీడ. కానీ కొందరికి ప్రాణం. క్రికెట్ పుట్టిన దేశం ఇంగ్లాడ్‌లో కన్నా మన దేశంలోనే దీనికి ఆదరణ ఎక్కువ. కోట్లాది మంది అభిమానులున్న క్రీడ ఇదే. క్రికెట్‌నే శ్వాసించే వారు.. ధ్యానించే వారు.. ఆదరించే వారికి ఇక్కడ కొదవ లేదు. సచిన్ టెండూల్కర్ వంటి మేటి క్రీడాకారులను క్రికెట్ దేవుడిగా అభిమానించే వారూ ఉన్నారు. ఇంతటి ఆదరణ కలిగిన క్రికెట్‌లో ప్రతి నాలుగేళ్లకోసారి వచ్చే పండగ వన్డే ప్రపంచ కప్.

అటువంటి ప్రపంచ కప్ పోటీల్లో భారత్ ప్రస్తుతం ఫైనల్స్‌కు చేరింది. అది కూడా అల్లాటప్పాగా కాదు.. ఇప్పటి వరకూ ఈ టోర్నమెంట్‌లో పరాజయం అనేదే లేకుండా.. వరుసగా పది మ్యాచ్‌లు గెలిచి మరీ ఫైనల్స్‌కు దూసుకువెళ్లింది. ఇదే సగటు అభిమానికి ప్రపంచ కప్ పోటీలో భారత్ విజయంపై ఆశలు పెంచింది. అయితే ఆస్ట్రేలియా జట్టు కూడా బలంగానే ఉందని, పోటీ హోరాహోరీగా సాగుతుందని క్రికెట్ అభిమానుల అంచనా. ప్రపంచ కప్ తుది పోరు ఆదివారం అహ్మదాబాద్‌లో జరగనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో సగటు అభిమానిని క్రికెట్ ఫీవర్ ఊపేస్తోంది.



ఎక్కడ చూసినా క్రికెట్ హంగామా..

- ఇండియా, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ చూసేందుకు ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ ఎటువంటి ఆటంకం లేకుండా ముందుగానే పనులు చక్కబెట్టుకుంటున్నారు.
- జిల్లాలో క్రికెట్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో రంగరాయ వైద్య కళాశాల క్రీడామైదానంలో భారీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. తునిలో మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో భారీ స్క్రీన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కాకినాడ రమణయ్యపేటలోని ఎమ్మెల్యే కన్నబాబు క్యాంప్ కార్యాలయంలో భారీ తెర ఏర్పాటు చేశారు. లైవ్ స్ట్రీమింగ్‌కు సన్నాహాలు చేస్తున్నారు.
- పలువురు పలు చోట్ల జాతీయ జెండాలకు గిరాకీ వచ్చింది. వీటిని పలువురు కొనుగోలు చేస్తున్నారు.
- వరల్డ్ కప్ ఫైనల్స్ ఫీవర్ సోషల్ మీడియాను కూడా కుదిపేస్తోంది. వాట్సాప్ స్టేటస్‌లతో పాటు డీపీలుగా, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో భారత విజయాన్ని కాంక్షిస్తూ పెద్ద ఎత్తున పోస్టింగ్‌లు వెల్లువెత్తుతున్నాయి.
- ఫైనల్స్‌పై బెట్టింగులు కూడా జోరుగా సాగుతున్నాయి. రెండు జట్లూ సమ ఉజ్జీలు కావడంతో బెట్టింగ్ కూడా రూపాయికి రూపాయి అన్నట్టుగా జరుగుతోంది. జాతీయాభిమానం, ట్రాక్ రికార్డు పరిశీలించిన ఎక్కువ మంది భారత జట్టుపై బెట్టింగ్‌కు మొగ్గు చూపుతున్నారు.

మనకే విజయావకాశాలు ఎక్కువ



వరల్డ్ కప్ ఫైనల్స్‌లో భారత జట్టుకు విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మన క్రీడాకారులు అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో కూడా మంచి ప్రదర్శన కనబరుస్తున్నారు. విరాట్ కోహ్లి, మహ్మద్‌షమీ తమ ఫాంను ఫైనల్స్‌లో కూడా కొనసాగిస్తే భారత్‌దే విజయం తథ్యం.

– డా.శివకుమార్, జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు

నూరు శాతం కప్ మనదే



స్టేడియంలో ఆస్ట్రేలియాను మించి అవకాశం ఉంది. దాదాపు లక్షమంది ఇండియా అభిమానులే..ఇండియన్ జట్టు లో గతంలో సచిన్, సెహ్వాగ్ ఆడితేనే మ్యాచ్ గెలిచే అవకాశం ఉండేది కానీ ఇప్పుడు బ్యాట్స్ మెన్‌తో పాటు బౌలర్లు స్ట్రాంగ్‌గా ఉంది. ఇంతా బాగా భారత్ ఆడిన వరల్డ్‌కప్ నా జీవితంలో చూడలేదు. ఆస్ట్రేలియా బ్యాటింగ్ అంత ఫాంలో లేకపోవడం కలిసి వస్తుంది.

– హరీష్, క్రికెట్ జిల్లా సంఘం మాజీ అధ్యక్షుడు

చాలా ఆనందంగా ఉంది



వరల్డ్‌కప్‌లో ఇండియా ఫైనల్స్‌కు రావడం చాలా ఆనందంగా ఫీలయ్యాను. ఈ వరల్డ్ కప్‌లో ఇండియా జట్టు ప్రదర్శన చాలా అద్భుతం. ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచింది. కచ్చితంగా కప్ ఇండియానే గెలువబోతుంది.

– కార్తీక్ రామన్,రంజీ క్రీడాకారుడు

రోహిత్ కెప్టెన్సీ బాగుంది



నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. వరల్డ్ కప్ పోటీలలో భారత్ ఆడిన అన్ని మ్యాచ్‌లూ చూశాను. రోహిత్‌శర్మ కెప్టెన్సీ బాగుంది. మన జట్టు ప్రతిభ ప్రత్యర్థులకు దడ పుట్టిస్తోంది. అహ్మదాబాద్ ఫైనల్‌లో మనకే విజయం రావాలని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను.

– స్రవంతి, క్రికెట్ అభిమాని

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

సత్యదేవుని దర్శించిన 40 వేల మంది



సత్యదేవుని వ్రతమాచరిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులు సత్యదేవుని సన్నిధికి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం, ప్రతమండపాలు, క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. సాయంత్రం నాలుగు గంటల వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించారు. స్వామివారి వ్రతాలు 4 వేలు జరిగాయి. స్వామివారి నిత్య కల్యాణంలో రూ.1,116 చొప్పున టిక్కెట్టు కొనుగోలు చేసి 50 మంది భక్తులు పాల్గొన్నారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు.ఆదివారం సెలవు దినం, కార్తీక సోమవారం పర్వదినాలు కావడంతో సత్యదేవుని సన్నిధికి భక్తులు వేలాదిగా తరలివస్తారని అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి స్వామివారి వ్రతాలు, 5 గంటల నుంచి స్వామివారి దర్శనం ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు. స్వామివారి నిత్యకల్యాణమండపంలో కూడా వ్రతాలు నిర్వహిస్తారు. అన్ని మండపాల్లో ఏక కాలంలో 1,500 మంది భక్తులు స్వామివారి వ్రతాలు ఆచరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు సర్కులర్ మండపంలో పులిహోర, దద్దోజనం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఇలా ప్రిపేరయితే మీరే విజేతలు

- 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు
- గ్రూప్–1, గ్రూప్–2 సన్నద్ధత సదస్సుకు మంచి స్పందన
- పోటీ పరీక్షలపై విద్యార్థులకు సివిల్స్ విజేత బాలలత సూచనలు





సదస్సులో మాట్లాడుతున్న సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత, హాజరైన విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యాన గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై కాకినాడ దంటు కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన ఉచిత అవగాహన సదస్సుకు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. దీనికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలను ఎలా ఎదుర్కోవాలో సదస్సు ద్వారా వారు తెలుసుకున్నారు. హైదరాబాద్ సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్, సివిల్స్ విజేత బాలలత విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఏ విద్యార్థి ఒత్తిడికి గురి కాకుండా పోటీ పరీక్షకు హాజరవ్వడంతో పాటు ఎప్పటికప్పుడు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. దివ్యాంగురాలైన తాను పోలియో కారణంగా తన కాళ్లకు సమస్య వచ్చిందని, పదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రైవేటుగా చదివి పాసయ్యానని చెప్పారు. దూరవిద్యలో బీఏ చదివానన్నారు. హైదరాబాద్ కోచింగ్ సెంటర్‌లో చేరి అవమానాలు ఎదుర్కొన్నానని అన్నారు. ఆ కసితోనే 2004 సివిల్స్‌లో 399వ ర్యాంక్ సాధించానని చెప్పారు. 2016లో 167వ ర్యాంక్ వచ్చిందని తెలిపారు. సివిల్స్ అభ్యర్థులకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందించడం శుభపరిణామమన్నారు. జెడ్పీ సీఈఓ అల్లిరెడ్డి రమణారెడ్డి, ప్యాకల్టీలు మనోజ్‌కుమార్, 'సాక్షి' బ్యూరో ఇన్‌చార్జి ఎల్.శ్రీనివాసరావు, యాడ్స్ మేనేజర్ వెంకటేశ్వరరావు, 'సాక్షి' సిబ్బంది పాల్గొన్నారు. ఈ సదస్సులో బాలలత కొన్ని సూచనలు చేశారు.

ఆమె సూచనలివీ..

- భారీ మెటీరియల్ పెట్టుకోకుండా సిలబస్‌పై అలో చించి పరీక్షకు ప్రిపరేషన్ రూపొందించుకోవాలి.
- మోడల్ పరీక్ష ప్రాక్టీస్ బాగుంటే నెగెటివ్ మార్కులకు ఆస్కారం ఉండదు.
- కష్టమైన సబ్జెక్టును ముందుగా తీసుకుని ఎక్కువ సమయం కేటాయించాలి.
- సబ్జెక్టు ప్రశ్నల స్థాయి ఏటేటా పెరుగుతుండటంతో అందుకు అనుగుణంగా దృక్పథాన్ని మార్చుకుని ప్రణాళికలు వేసుకోవాలి. కష్టమనిపించే టాపిక్ అర్థం కావాలంటే మైండ్ మ్యాప్ వేసుకుని కథనం రూపంలో మార్చుకోవాలి.
- ఏ టాపిక్‌పైనైనా సొంత నోట్స్ రాసుకుని సంక్షిప్త పాఠించాలి.



సదస్సులో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రమణారెడ్డి

విలువైన సదస్సు



'సాక్షి' మీడియా ఉపయుక్తమైన సదస్సు ఏర్పాటు చేసింది. పోటీ పరీక్ష శిక్షణలో నిష్ణాతురాలైన బాలలత మేడం విలువైన సూచనలిచ్చారు. రానున్న రోజుల్లో జరిగే పోటీ పరీక్షలకు ఇవి చాలా బాగా ఉపయోగపడతాయి.

– టి.ఐశ్వర్య, డిగ్రీ విద్యార్థి

వివరంగా చెప్పారు



పోటీ పరీక్షల విధానం, సిలబస్, సబ్జెక్టులు తదితర అంశాల గురించి లోతుగా, వివరంగా తెలియజేశారు. ఐఏఎస్ శిక్షణ సంస్థకు చెందిన వారు వచ్చి 'సాక్షి' ఆధ్వర్యాన ఈ సదస్సు నిర్వహించడం సంతోషంగా ఉంది.

– సీహెచ్ గణేష్, ఎంసీఏ

చక్కగా వివరించారు



పరీక్షకు సన్నద్ధమవ్వడం, ఏ విధంగా ఏకాగ్రతగా ఉండాలి వంటి అంశాలను బాగా వివరించారు. రెగ్యులర్ చదువుతో పాటు పోటీ పరీక్షలకు ఎలా సమయం కేటాయించాలి వంటి విషయాలు మనసులో నాటుకునేలా చెప్పారు.

– ఎం.జోషి, డిగ్రీ విద్యార్థి

సంతోషంగా ఉంది



పోటీ పరీక్షల భయాన్ని పోగొట్టారు. ఉద్యోగం సాధించాలనే కోరిక ఉన్న వాళ్లకు ఈ సదస్సులో చెప్పిన అంశాలు చాలా బాగా ఉపయోగపడతాయి. నిరుద్యోగ యువతకు ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించిన 'సాక్షి' మీడియాకు ప్రత్యేక అభినందనలు.

– కె.దుర్గాదేవి, డిగ్రీ విద్యార్థి

శ్రీనివాసా.. శ్రీ వేంకటేశా..





వాడపల్లిలో భక్తజన ప్రవాహం. (అంతరచిత్రం) ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిలో కార్తిక శోభ వెల్లివిరిసింది. ఈ పవిత్ర మాసంలో మొదటి శనివారం కావడంతో ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వేలాదిగా భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు పావన గౌతమీ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. తలనీలాలు సమర్పించి, భారీ క్యూలలో బారులు తీరి మరీ స్వామివారిని దర్శించుకుని, కానుకలు సమర్పించారు. అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల గోవింద నామోచ్చారణతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. స్వామివారిని వేద పండితులు, అర్చకులు సుగంధభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా గావించారు. ఆలయ ఆవరణలో వేలాది మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ప్రత్యేక దర్శనం, అన్న ప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదం విక్రయం, ఇతర విరాళాలు, ఆన్‌లైన్ ద్వారా స్వామి వారికి రూ.32,13,379 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు 26 తుది గడువు

రాయవరం: ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 26వ తేదీ వరకూ గడువు ఉందని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం జిల్లా కో ఆర్డినేటర్ పి. సాయి వెంకట రమణ శనివారం ఒక ప్రకటనలో తెలి పారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకూ అపరాధ రుసుంతో అడ్మిషన్ పొందవచ్చన్నారు. అడ్మిషన్, రిజిస్ట్రేషన్ ఫీజు పదో తరగతి ఓసీ పురుషులకు రూ. 1,550, అన్ని వర్గాల మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ పురుషులకు రూ.1,150 చెల్లించాలన్నారు. ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్‌కు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజుగా ఓసీ పురుషులు రూ.1,800, అన్ని వర్గాల మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ పురుషులు రూ.1,500 చెల్లించాలన్నారు. విద్యార్థులు ప్రాస్పెక్టస్ కమ్ అప్లికేషన్ ఫాంలను స్టడీ సెంటర్ నుంచి ఉచితంగా పొందవచ్చని తెలిపారు. దర ఖాస్తు పూరించి, ఏపీ ఆన్‌లైన్ కేంద్రం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్ జిరాక్స్ కాపీ, ఫీజు రశీదును సంబంధిత అక్రిడిటేటెడ్ ఇన్‌స్టిట్యూట్స్(ఏఐ)లో ఇవ్వాలని తెలిపారు. అడ్మిషన్ పొందిన వారు 30 రోజుల పాటు విధిగా తరగతులకు హాజరవాలన్నారు. స్టడీ సెంటర్‌లో ఎటువంటి ఫీజు లూ చెల్లించనవసరం లేదని, దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు సమీప అక్రిడిటేటెడ్ ఇనిస్టిట్యూట్లలో లేదా 89776 45704 నంబరును సంప్రదించాలని తెలిపారు.

కట్టుకున్న వారి కళ్లెదుటే.. కానరాని లోకాలకు..

పాణిగ్రహణం చేసిన వేళ.. జీవితాంతం తోడు, నీడగా నడుస్తామని చెప్పిన వారు.. తమ కళ్లెదుటే కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో వారి జీవిత భాగస్వాములు గుండెలు పగిలేలా కన్నీరు మున్నీరుగా రోదించారు. పశ్చిమ గోదావరి, కాకినాడ జిల్లాల్లో శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వివాహితలు దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటనలు వారి కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చాయి.

- వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వివాహితల దుర్మరణం
- 'పశ్చిమ'లో బస్సు దూసుకువెళ్లి ఒకరు..
- తుని వద్ద కారు ఢీకొని మరొకరు..
- ప్రమాద స్థలాల్లో కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు





ప్రత్తిపాడు ప్రమాదంలో మృతురాలు పుష్ప (పాత చిత్రం) భార్య మృతితో కుమారులను పట్టుకుని రోదిస్తున్న రాము



చేపూరు వద్ద తీవ్రంగా గాయపడిన భార్య విజయలక్ష్మిని స్పృహలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్న ఆనంద్

భర్త, పిల్లలతో రైలులో విజయవాడ వెళ్దామని..

పెంటపాడు: భర్త, ఇద్దరు పిల్లలతో కలసి బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తూ అదుపు తప్పి కింద పడిన ఓ వివాహిత.. వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడు వై.జంక్షన్ సమీపాన ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన కుడుపూడి రాము, పుష్ప (27) ఎనిమిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఆరు, మూడేళ్ల వయస్సున్న ఇద్దరు కుమారులున్నారు. విజయవాడ వెళ్లేందుకు వీరు ట్రైన్ టికెట్ బుక్ చేసుకున్నాడు. అయితే తాడేపల్లిగూడెం నుంచి రిజర్వేషన్ దొరకడంతో అంబాజీపేట నుంచి భార్యా పిల్లలతో కలిసి రాము బైక్‌పై బయలుదేరాడు. ప్రత్తిపాడు వద్దకు వచ్చేసరికి ఆకస్మాత్తుగా బైక్ అదుపు తప్పింది. దీంతో భార్య పుష్ప రోడ్డుపై పడిపోయింది. సరిగ్గా అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న అమలాపురం డిపోకు చెందిన ఆర్టీసీ గరుడ బస్సు ముందు చక్రం ఆమె తలపై నుంచి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో తల నుజ్జునుజ్జయి పుష్ప సంఘటన స్థలంలోనే దుర్మరణం పాలైంది. అప్పటి వరకూ తనతో సరదాగా మాట్లాడిన భార్య కళ్లెదుటే విగతజీవిగా మారడంతో రాము ఆమె మృతదేహంపై పడి గుండెలవిసేలా విలపించాడు. తన కుమారులకు దిక్కెవరంటూ బోరున రోదించాడు. ఎస్సై హరికృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టింటికి వెళ్తూ.. మృత్యు ఒడికి..

తుని రూరల్: తల్లిని చూసేందుకు పుట్టింటికి బయలుదేరిన ఓ వివాహిత మార్గం మధ్యలోనే మృత్యు ఒడికి చేరిన విషాద సంఘటన ఇది. రాజమహేంద్రవరం నగరానికి చెందిన కాలికురస విజయలక్ష్మి (30), తన భర్త ఆనంద్‌తో కలసి మోటార్ సైకిల్‌పై తుని మండలం దొండవాక గ్రామానికి శనివారం సాయంత్రం బయలుదేరింది. గ్రామంలో ఒంటరిగా ఉంటున్న తన తల్లి కాలక్షేపానికి పని చేస్తుందన్న ఉద్దేశంతో ఎల్ఈడీ టీవీ తీసుకువెళ్తున్నారు. ఆ టీవీని విజయలక్ష్మి పట్టుకుని మోటార్ సైకిల్‌పై భర్త వెనుక కూర్చుంది. మరో అరగంటలో తల్లి చెంతకు చేరుకునేదే.. అంతలోనే తుని మండలం చేపూరు సమీపాన పదహారో నంబర్ జాతీయ రహదారిపై వెనుకే మృత్యుశకటంలా వచ్చిన కారు విజయలక్ష్మి చేతిని తాకుతూ దూసుకుపోయింది. దీంతో మోటార్ సైకిల్ అదుపు తప్పి, దానిపై ఉన్న విజయలక్ష్మి, ఆనంద్ రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో రోడ్డును బలంగా ఢీకొనడంతో విజయలక్ష్మి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను మేల్కొలిపేందుకు ప్రయత్నిస్తుండగానే భర్త ఒడిలో విజయలక్ష్మి మృతి చెందింది. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. విజయలక్ష్మిని పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. వీరిద్దరికీ వివాహమై మూడేళ్లయ్యింది. ఇంకా సంతానం లేరు. రూరల్ సీఐ సన్యాసిరావు సంఘటన స్థలానికి చేరుకుని విజయలక్ష్మి మృతదేహాన్ని, స్వల్పంగా గాయపడిన ఆనంద్‌ను 108లో తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

సామాజిక విశ్లేషణ కోసం కులగణన


జేసీ ఇలక్కియ స్పష్టీకరణ



సమగ్ర కులగణనపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఇలక్కియ

కాకినాడ సిటీ: జిల్లాలో ఈ నెల 27 నుంచి చేపట్టే సమగ్ర కులగణనకు అన్ని సామాజిక వర్గాల ప్రజలూ సహకరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ కోరారు. సమగ్ర కుల గణన నిర్వహణపై కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ హాలులో జిల్లా స్థాయి అవగాహన, సూచనల స్వీకరణ కార్యక్రమం శనివారం జరిగింది. ఇందులో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ పీవీ రమణమూర్తి, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.త్రినాథ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వివిధ కులాల, వర్గాల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. గ్రామ/వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో కులగణన ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. యాప్‌లో నమోదు చేసే సమాచారానికి పూర్తి భద్రత, గోప్యత ఉంటుందన్నారు. జాయింట్ కలెక్టర్ ఇలక్కియ మాట్లాడుతూ, కులాల వారీగా జనాభా, సామాజిక, విద్య, ఆర్థిక పరిస్థితులు తెలుసుకుని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించేందుకు కులగణన దోహదపడుతుందన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్నది సామాజిక విశ్లేషణ ప్రక్రియ మాత్రమేనని చెప్పారు. ఈ సమాచారం ఆధారంగా ఎవ్వరికీ ఏ ప్రయోజనాలూ తొలగించరని స్పష్టం చేశారు. ఈ సమాచారం ఆధారంగా కుల ధ్రువపత్రాలు జారీ చేయరన్నారు. కుటుంబ యజమాని, సభ్యులు చెప్పే కుల వివరాలనే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కొడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, కాకినాడ అర్బన్ ఏఎంసీ చైర్ పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుల గణన చరిత్రాత్మక ఘట్టమన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ ఎం.రమేష్, రిటైర్డ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ దొమ్మేటి సుధాకర్, ఏజీపీ గెద్దాడ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.పవన్‌కుమార్, కులపెద్దలు, సంఘాల నేతలు అనుసూరి ప్రభాకర్, జాన్ వెస్లీ, కోనేటి రాజు, సుందరపల్లి గోపాలకృష్ణ, అమలదాసు నూకరాజు, నక్కా కిషోర్, అనపర్తి ఏడుకొండలు, అన్నవరం సర్పంచ్ కుమారరాజా, తాడి బాబ్జీ, చెంగ్రావు, మాతా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని తమ సలహాలు, సూచనలు తెలియజేశారు.

కొమ్మకొమ్మకూ బొప్పాయి



'నా రూటే సెపరేటు' అన్నట్టుగా ఎదిగింది ఆ బొప్పాయి చెట్టు. సాధారణంగా బొప్పాయి చెట్టు ఒకే కాండంతో నిటారుగా ఎదుగుతుంది. దానికే కొన్ని బొప్పాయి కాయలు కాయడం సహజం. అయితే అమలాపురం పద్మినీపేటలోని యాళ్ల బాబులు కొబ్బరి తోటలో ఓ బొప్పాయి చెట్టు ఎదిగిన తీరు భిన్నంగా ఉంది. ఇది ఏకంగా మూడు కొమ్మలతో ఎదిగింది. కొమ్మకొమ్మకూ అనేక కాయలు కాస్తూ చూపరులను ఆశ్చర్యపరుస్తోంది.

– అమలాపురం టౌన్